మామ పరలోకానికి వెళ్లేడు. అన్నదమ్ములు పంచుకున్నారు. ఎల్లాగంటే అత్తగారు ఒక భాగం, ధనమంతా ఒకభాగం. చిన్నకోడలు అత్తగార్ని తీసికుంది. ధనమంతా పెద్దకోడలికి వెళ్లింది. చిన్నకోడలు పొద్దున్నే లేచి "అత్తా! మొహంకడుక్కో. అత్తా! మడికట్టుకో" అని అస్తమానూ అత్తగారికి ఉపచారాలు చేస్తుండేది. ఇదంతాచూస్తే పెద్దకోడలికి అత్త గారు కావాలని మనసుఅయింది. డబ్బుందికనక ఒకఇత్తడిబొమ్మని చేయించి దాన్ని అత్త గారు అనిభావించుకుని అన్నివుపచారాలు చేస్తుండేది. ఏపనీ వేళకుచెయ్యకుండాఉంటే పెని మిటి[ప్రాణంవిసికి ఇంట్లోంచిలేచిపొమ్మన్నాడు. పాపం ఆవిడ ఆఇత్తడిబొమ్మను కూడా తీసికుని పోయింది. అలావెళ్లేటప్పటికి ఒక అరణ్యందగ్గర చీకటిపడిపోయింది. క్రిందపడుకుంటే ఏవన్నా చంపేస్తాయని ఒకమర్రిచెట్టెక్కి అత్తగార్ని వళ్లోపెట్టుకుని పడుకుంది. ఆరాత్రిదొంగలు రాజుగారింట్లో కన్నంవేసి ఆచెట్టుక్రింద పంచుకుంటున్నారు ధనమంతా. పైననిద్రపోతూన్న కోడలివళ్లోనించి ఇత్తడిఅత్తగారు జారి గలగలమంటో వాళ్లదగ్గరపడింది. పడీపడ్డంతో దొంగలంతాభయపడి "బాబో! శక్తి" అంటూ నలుగురు నాలుగుదిక్కులకి పరుగెత్తేరు. ఈఅల్లరితోటి కోడలికి మెలుకువవచ్చి దగ్గర అత్తగారులేకపోవటంచేత క్రిందకిదిగి చూసింది. అక్కడమిరుమిట్లుగొలుపుతో బోలెడంతధనం, అత్తగారు కనబడ్డారు. ఇదంతా ఇత్తడత్త గారి మహాత్యమేనని ఆడబ్బుని, అత్తగారిని తీసికుని తెల్లారేటప్పటికి ఇంటికివెళ్లి తలుపుతీయ మంది. "ఛీ.నాయింటికిరావద్దు" అన్నాడుపెనిమిటి. "అల్లాకాదు.డబ్బు పట్టుకొచ్చా" నని చెప్పి లోపలికెళ్లి డబ్బువచ్చిన విధమంతాచెప్పి డబ్బుకొల్చుకోడానికి తోడికోడల్ని కుంచంఅడిగింది. ఆవిడ గడుసుది గనక కుంచానికి కాస్త చింతపండు పెట్టిఇచ్చింది. పెద్దకోడలు కొలుచుకుని కుంచం దులపడంమరిచిపోయి ఇచ్చేసింది. కుంచానికి ఒకవరహా అంటుకుంది. అది చిన్న కోడలు చూచి "అక్కా! ఈడబ్బు ఏలావచ్చింది?" అని అడిగింది. పెద్దకోడలు జరిగిందంతా చెప్పింది. "నీవు ఇత్తడత్తగార్ని తీసికెడితే నేనునిజమత్తగార్ని తీసికెడతా" నని చెప్పి వెయ్యి గజ్జలుతెప్పించి అత్తగారికికట్టి సాయంకాలానికి ఆచెట్టుదగ్గరకివెళ్లి చెట్టుమీదకూర్చుంది నిద్ర పోకుండా. అప్పుడుకూడా దొంగలు ధనందోచుకుని పంచుకుంటుంటే అత్తగార్ని కిందకివిడిచింది. ఆదొంగలు "ఇదేమిటి? మొన్న ఈలాగేఅయింది. ఈవేళా ఇలాగేవుంది" అని చెట్టెక్కి చూశారు. వణుకుతూ చిన్నకోడలు కనిపించింది. ఆవిణ్ని మెత్తగా తన్నిపంపేరు. పాపం అత్త గారు ముసల్దికనక క్రిందపడగానే ఠమ్మనిచచ్చింది. ఏడుస్తో చచ్చినఅత్తగార్ని బుజాన్నవేసి కుని ఇంటికెడితే మొగుడు కేకలేశాడు. అత్తపోయింది, డబ్బులేదు అని చాలావిచారించింది.

## అరడబ్బు

శ్రీమతి ధవళ రాజేశ్వరమ్మగారు

అనగా అనగా ఒకఊళ్లో ఒక బ్రాహ్మణుడుండేవాడు. వాడిపేరు "అరడబ్బు". వాడికి తినడానికి తిండిలేకపోయినా మంచినేర్పుతో డబ్బుసంపాదించే చాకచక్యముకలదు. ఇల్లా ఉండగా ఒకనాడు వాడు


830

వాళ్ల ఊరికి సుమారు ఆరు మైళ్ల దూరములో ఉన్న సంతకు వెళదామనుకొన్నాడు. ప్రొద్దున్నే బయలుదేరి వెళుతూంటే దారిలో ఒక చిన్న గ్రామం తగిలింది. వీడికి ఆకలి దాహము వేస్తున్నాయి. అయితే ఏంచేస్తాడు? చేతిలో కానీ లేదు. అలా వెళుతూంటే ఒక ముసలి అవ్వ ఒక యింట్లో గుమ్మముకడిగి ముగ్గుపెడుతూంది. దానిని చూచేడు మన బ్రాహ్మడు. "దీనికిటోపీ వెయ్యాలిరా!" అనుకొని దగ్గరకు వెళ్లి, "అవ్వా! బాగా ఉన్నావా?" అని పలుకరించేడు. "ఎవరు నాయనా?" అంది అవ్వ పాపం. "నా పేరు అరడబ్బంటారు. నేను చాలదూరం నుంచి వస్తున్నాను. సంతకు పోవాలి. ఆకలి వేస్తోంది, దయ ఉంచి కొంచెము చద్దన్నము పెడుదూ," అని అవ్వని మంచిమాటలాడేడు. పాపం అవ్వ ఆశపడింది. వీడరడబ్బిస్తాడు కాబోలు తనకొడుక్కి తెలియకుండా దాచుకుందామనుకొని "రా నాయనా!" అని కొత్తఆవకాయముక్క ఒకటి వేసి యింత చద్దన్నము పెట్టింది. బ్రాహ్మడు కులాసాగా తిన్నాడు. పంచ కట్టుకొంటూన్న బ్రాహ్మణ్ణి చూచి, "నాయనా! ఏటికిపోయి నీళ్లు తెచ్చుకొంటాను. అరడబ్బిస్తావా?" అంది పాపం అవ్వ. "అరడబ్బేమిటి? నీ వెవ్వరు? నీ కెందుకివ్వాలి?" అన్నాడరడబ్బుగాడు. "అయ్యో! అయ్యో! ఇదేమన్యాయం. తిండితిని డబ్బివ్వవట్రా? నాకొంపతీసేవు" అని కేకలేస్తూంది దిక్కుమాలిన అవ్వ. వీడు కేకలకు లక్ష్యపెడతాడూ? "అరుచుకో ముండా! నీకు దేముడంతే రాతాడు" అని పెడమొఖము పెట్టి తనుబట్టలు కట్టుకొంటున్నాడు అరడబ్బుగాడు. ఇంతలో చేతిలో కర్రా, నెత్తిమీద టోపీ, సూటు, బూట్సు వేసుకొని ఒక యువకుడు సుమారు 25 ఏళ్ల వయస్సుగలవాడు ఆయింట్లోకి వచ్చేడు. "నాయనా! చూసేవురా వీడు ఏంజేస్తున్నాడో, నాకరడబ్బిస్తానని చెప్పి మనయింట్లో భోజనము చేసి డబ్బివ్వకుండాపోతున్నాడు" అని అవ్వ కొడుకుతో చెప్పి ఏడ్చుకుంది. అరడబ్బుగాడికి గుండెలో రాయిపడింది. "చచ్చేమురా దేముడా, యిదేమిటీగోల, నేపోయీదాకా నైవడున్నాడు కాడీముండాకొడుకు, ఈశకటం నన్నేదో అల్లరపెట్టేలాగ కుపడుతున్నాడు. కానీ, నాబుద్ధి ఉపయోగించి వీడినిబట్టలో వెయ్యక పోతానా?" అనుకొన్నాడు. "ఏమోయి, సామ్మిచ్చేస్తావా? పోలీసుకు పప్పచెప్పాలానిన్ను" అన్నాడు అవ్వకొడుకు సుందర్రావు. "నేను మీఅమ్మకిబాకీలేను. సొమ్మిస్తాననలేదు. నన్ను పోలీసుకప్పచెప్పినా యిదేజవాబు వారికికూడా" అన్నాడు అరడబ్బుగాడు. "ఇలారా! పోలీసువాళ్లకి నిన్నప్పచెప్తాను." అన్నాడు సుందర్రావు. సుందర్రావు మున్సబుకచేరీలో గుమస్తా. పాపం అరవై రూపాయిలిచ్చినా ఏవో ఫండులట, మెుత్తంమీద కొట్టిగా వీడికి ఏభై రూపాయిలు నెల అయీసరికి ముడతాయి. పెద్దకుటుంబము అవడముచేత సుందర్రావుకు అప్పులు లావు. ఆరోజునే జీతం అందుకొని అప్పులన్నీ తీర్చుకొని ముప్పై రూపాయిల చిల్లర జేబులో వేసుకొని ఇంటికివచ్చేడు. అయితే అరడబ్బన్నాడుగదా "నేనిలా ఈబట్టలతో పోలీసు వాళ్లదగ్గరకు రాను. నీబట్టలు నాకిస్తే నేనవి వేసుకొని వస్తాను. అందాకా నాగోచిపాతలు నీవు కట్టుకో" అని. సత్తికాలపు సుందర్రావు, అరడబ్బు వస్తుందనే సంతోషముతో తనబట్టలన్నీ రూపాయిలతో కూడా వీడికిచ్చి, వాడివేషం వీడు వేసుకొని "పద నీపని చెప్తాను" అన్నాడు. "సరే!" అని వాడిమాటు వగయిరాలన్నీ వీడు ధరించి గబగబా వాడికన్న ముందుగా పోలీసు సబిన్స్పెక్టరు గారిదగ్గరకు వెళ్లి, "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు అరడబ్బుగాడు. ఇన్స్పెక్టరు ఎవరో పెద్దమనిషి యనుకొని, కుర్చీ యొకటిచ్చి "దయచెయ్యండి" అన్నాడు. పాపం, సుందర్రావు రాకముందే వీడు సబిన్స్పెక్టరుతో ఏవో లేనిపోనివి చెప్పి, వాడిని మెల్లగా అవతలకు పంపించే ఏర్పాటు చేశాడు. సుందర్రావు రావడంతోటే "ఏమోయి, నీవిలా పెద్దమనుష్యులదగ్గర అబద్ధమాడుట బాగులేదు. ఇటుపైని యిలా చేసేవంటే చీటింగ్ క్రింద నిన్ను కొట్లో వేయిస్తా" నన్నాడు సబ్ యిన్స్పెక్టరు సుందర్రావుని చూచి. "అదికాదు బాబు! నామాటవినండి" అన్నాడు పాపం సుందర్రావు. "నాన్ సెన్సు! ఫో యిక్కడమాట్లాడకు. ఓయి, 223, వీడిని అవతలకు పంపించేయి" అన్నాడు సబిన్స్పెక్టరు.

"పదరా అవతలకి" అన్నాడు 223 నెంబరు కానిస్టీబు. "బాగా చేశాడు లంజాకొడుకు, నాకేబులో సొమ్ము కూడాపోయిందిరా దేముడా"అని మనసులో అనుకొని వీడినితందామని త్రోవకాచి కూర్చున్నాడు సుంద్రావు. "అయ్యా! నేసెలవుతీసుకొంటా"అని సబిన్స్పెక్టరుగారితో చెప్పి అచ్చట బంట్రోతులకు రెండు రూపాయిలిచ్చి అర్థరాత్రో పడ్డాడు మన బ్రాహ్మడు. పాపం, సుంద్రావు, పన్నెండుగంటలదాక తిండి లేక వీడికోసం కాచికూర్చొని ఆఖరకు "అలో లక్ష్మణా"అని ఏడుస్తూ యింటికిపోయేడు. కథ కంచి కెళ్లింది. మనం ఇంటికొచ్చేం.

## నూనెగుడ్డలవాడు

శ్రీమతి బసవరాజు వేంకటరాజ్యలక్ష్మమ్మగారు

రామారావుగారు భీమవరంలో కొత్తగా ఇల్లుకట్టుకుని గృహప్రవేశమైనారు. ఆయన డిప్టీకలెక్టరుఉద్యోగంచేసి నాలుగువందలరూపాయలు పింఛను తీసుకుంటున్నారు. సిరీసంపదా అన్నివిధములా బాగానేవున్నవి. పింఛను తీసుకున్నాముగదా అని ఒకవూరిలోనే వుండవచ్చునని సొంతయిల్లు కట్టుకున్నారు. ఏమిటో యిల్లుకట్టినప్పటినుంచీ ఆయనకు కొంచెము సుస్తీగానేయున్నది వంట్లో. కాని అల్లాగే తిరుగుతున్నాడు. రోజురోజుకీ మనిషి శుష్కించి పోతున్నాడు. ఇంతలోకే దేవీనవరాత్రములు వచ్చినవి. పార్వతినిపూజిస్తే ఆయన ఆరోగ్యము బాగుపడునని భార్యాభర్తలిద్దరూ కలశంపెట్టి తొమ్మిదిరోజులూ భక్తితో పార్వతిని పూజించేరు. తమ ఆరోగ్యము కాపాడమని దేవికి భక్తితో నమస్కరించేరు. కాని రోజురోజుకూ మంచంమీదనుంచే లేవలేకపోతున్నారు. చివరకు ఒకరోజు రామారావుగారింట్లోఅంతా ఆయనఆరోగ్యంవిషయమై ఆశలువదలుకొని విచారంగావున్నారు. ఆసమయానికి ఒకనూనెగుడ్డలవాడు ముష్టికివచ్చి "అంబాపలుకు, జగదంబాపలుకు, శాంభవీ పలుకు! ఈఇంట్లో ఒకకష్టం వచ్చింది. రేపటితో యీయింటియజమానికి ఆయుర్దాయం సరి"అన్నాడు. అందరూ "వీడిమాటలకేమిటి? వీడికి ముష్టిపెట్టలేదని ఇల్లాగేచెపుతాడు. పోపొ"మ్మన్నారు. రామారావుగారిభార్యమాత్రం అలాఒప్పుకోక ఆనూనెగుడ్డలవాడిని "నీచేతనైతే ఏదైనాచేస్తావా?"అని అడిగింది. "నేనుచెప్పినట్టుచేస్తే బాగవుతుం"దన్నాడు వాడు. "ఈక్షణమే మీసింహద్వారము పడగొట్ట"మన్నాడు. అందరూ వీడికేమైన పిచ్చా అనుకున్నారు. కాని రామారావుగారిభార్యమాత్రం ఏవిధముచేతనైనా తనభర్తబాగుంటే చాలని సింహద్వారం పడగొట్టమంది. అందరూవద్దన్నారు. అందు కానూనెగుడ్డలవాడు "అమ్మా! మీసింహద్వారం ఎత్తేకముందు వడ్రంగిదరువాజాచేసి సీలలుబిగించకుండా వెళ్లేడు. ఒకతాచు అందులో ప్రవేశించింది. అది వడ్రంగిచూడకుండా సీలలుబిగించేడు. పాము ఆరోజుమొదలు గాలీ ఆహారములేక లోపలశుష్కిస్తూంది. అందుకని యజమాని కాపాపము కొట్టి యిలాఅయినారు. దానికి రేపటితోసరి. ఈయనకీ రేపటితోసరి ఆయుర్దాయం. ఈసింహద్వారం పడగొట్టి సీలలుఊడదీయిస్తే పాము బయటికివస్తుంది. అప్పటినుంచీ యజమానికి ఆరోగ్యం బాగవుతుం"దన్నాడు. ఆమాటలు నిజమేమిటో అందరూచూడాలను

832